# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-11 1 జులై - 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయ విలువలు - లోకవిద్య

విలువ అంటే అందరికి పెరుగుతున్న బంగారం విలువ, పడిపోతున్న రూపాయి విలువ మాత్రమే గుర్తుకొచ్చే ఈ రోజుల్లో లోకవిద్యా ప్రపంచం మన భారతీయ విలువల గురించి చర్చను ప్రారంభించాల్సిన అవసరం గుర్తించింది. మన విలువలన్నీ ఇతిహాసాలు, పురాణాల్లో ప్రతిబింబిస్తాయి. వందల, వేల సంవత్సరాల్నుంచి మనం గుర్తుపెట్టుకొంటున్న వ్యక్తులు, వారి జీవన విధానంలో వారు చేసిన పనుల్లో మనకి గోచరిస్తాయి. ఉదా : మాట తప్పని హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, ధర్మరాజు వీళ్ళనెందుకు గుర్తుపెట్టుకుంటామంటే ఆడిన మాట తప్పలేదనే భావనలు. ఈ రోజు ఆడినమాట తప్పడానికి చట్టం మనకు వెసులుబాటు కల్పిస్తోంది. ఉదా : 17 ఏళ్ళ పాటు 2 డాలర్లకు మాత్రమే ప్రతి యూనిట్ గ్యాస్‌ను ఇస్తాననే మాట రిలయన్స్ కంపెనీ ఇవ్వడంతో వారిని నమ్మిగ్యాస్ వెలికితీయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం జరిగింది. మాట తప్పుతారేమోనని ఒప్పందంపై సంతకాలు కూడా పెట్టారు. కానీ సంతకాల తడి ఆరకముందే ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్ ధర పెరుగుతోంది కనుక ధరలు పెంచాలని అడిగిందే తరువాయి అదే యూనిట్‌కు ముందు 4రూ, తరువాత 6 రూ॥ చొప్పున అంతిమంగా 8 డాలర్లకు పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించింది. ఇది అన్యాయమని కేకలు వేసిన బి.జె.పి నిన్నటి వార్తల ప్రకారం 6 డాలర్లకు 1 యూనిట్ గ్యాస్ ధరను నిర్ణయించినట్లు తెలుస్తోంది. విలువలు గూర్చి మాట్లాడే బి.జె.పి ప్రభుత్వం మాటకు ఒప్పందానికి కట్టుబడి రెండే డాలర్లు చెల్లిస్తారని నమ్మి ఈ దేశ ప్రజలు బి.జె.పి.కి ఓటేశారు. బ్యాంకుల నుంచి పెట్టుబడి గానో, సరుకుచూపించి, సరుకు రాబోతుందని కాగితాలు చూపించి లక్షల కోట్లు అప్పులు తీసుకున్న కంపెనీలు ఖాయిలాపడ్డాయని ఒప్పందాలకు విరుద్ధంగా ఈ అప్పులు కట్టక్కర లేదని లక్షల కోట్ల రుణాల మాఫీ కోరడం దానికి ఒక చట్టం తేవడం, ఇది ఆడిన మాట తప్పడం కాదా? మన భారత రాజ్యాంగంలో మన సంస్కృతిని పరిరక్షించాలని 51(ఎ), (ఎఫ్) అధికరణలో రాసుకున్నదానికి ఇది వ్యతిరేకం కాదా? ఇక్కడే గ్రామీణ ప్రాంతంలో అప్పులు తీర్చడం గురించి ప్రస్తావించడం అవసరం. ఈనాడు కూడా తండ్రి చనిపోయిన కర్మకాండల అంతిమ దినాన గ్రామస్తులు, బంధుమిత్రుల సమక్షంలో పురోహితుడు నువ్వు చేసిన అప్పుతో పాటు నీ తల్లిదండ్రులు చేసిన అప్పులు కూడా వారి బాధ్యతలతో పాటు నువ్వు నిర్వహిస్తేనే చనిపోయినవారి ఆత్మలకు శాంతి కలుగుతుందని బోధిస్తారు. అంటే పట్టణ ప్రాంతంలో పరిశ్రమలకి ప్రస్తుత ప్రభుత్వ విధానాలలో అప్పులు ఎగ్గొట్టమనే సంస్కృతికి ఇన్నాళ్ళూ గ్రామీణ భారతం ఆహ్వానం పలకలేదు. కానీ నేడు మాక్కూడా రుణ మాఫీ చెయ్యండని రాయితీతో ఇతర సౌకర్యాలు కల్పించండని గ్రామీణ భారతం నేడు కోరుకుంటోంది. దీనికి ప్రధాన కారణం తమ నష్టాన్ని పూడ్చుకోవటానికి పట్టణ విలువలను స్వీకరించడానికి తయారవ్వడమే.

పెట్రోలు కనిపెట్టి 100 సం॥రాలు దాటకుండానే ప్రపంచంలోని పెట్రోలు, డీజిలంతా తరలించుకుపోయి ప్లాస్టిక్ ఉత్పత్తికోసం, పాలిస్టర్ బట్టలకోసం కృత్రిమ ఎరువులు, పురుగుమందుల కోసం వాడి అమెరికా అత్యున్నత జీవన ప్రమాణాల్ని అందుకుంది. ప్రపంచంలో వాడే ఇంధనంలో సగం వారే వాడేసారు. ఈ రోజు ఈ ఇంధన కాలుష్యంతో భూతాపం పెరగడం, తీవ్ర వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం, ప్రపంచ వ్యాప్తంగా కొత్త కొత్త వ్యాధులు భయంకరంగా వ్యాపించడం వీటన్నింటిని అదుపు చేయటానికి అన్ని దేశాలు సమానంగా చర్యలు తీసుకోవాలని సిద్ధాంతం ప్రతిపాదించడం జరిగింది. మొత్తం నష్టం చేసినవాళ్ళే నష్టాన్ని అందరిమీద రుద్దడం జరుగుతోంది. ఇంధన వాడకాల మీద ఆంక్షలు మొదలయ్యాయి.

దీన్ని అభివృద్ధి అనుకునే ప్రభుత్వాలే పారిశ్రామిక ఉత్పత్తులకు ధరలు నిర్ణయించుకునే అధికారాన్ని పారిశ్రామిక వేత్తలకు కల్పించారు. కాని రైతులు, చేతివృత్తులవారు తమ ఉత్పత్తి నిమిత్తం పారిశ్రామిక ఉత్పత్తులు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, యంత్రసామాగ్రి, చేతివృత్తి పరికరాలు, పారిశ్రామికవేత్తలు నిర్ణయించిన ధరలకు కొని వారి ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన కనిష్ట ధరకు నిర్బంధంగా అమ్మడం వలన ఉత్పత్తి ధర, ఖర్చులు పెరిగి, అమ్మకం ధర తక్కువై, గిట్టుబాటు ధర దొరక్క అప్పుల్లో కూరుకుపోయి దివాలా తీస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల సహజసిద్ధమైన ఉత్పత్తులను కొనడం మానివేసి, ప్రత్యామ్నాయ కృత్రిమ ఉత్పత్తులతో వాతావరణాన్ని, భూగర్భ జలాన్ని కలుషితం చేసి తాగునీటి కోసం కూడా పట్టణ ప్రాంతం నుంచి వచ్చే నీళ్ళ ప్యాకెట్లు, మినరల్ వాటర్ బాటిళ్ళ మీద ఆధారపడే గ్రామీణ భారతాన్ని సృష్టిస్తున్నారు. ఇదంతా అభివృద్ధి అని నమ్మబలుకుతున్నారు. దివాలా తీసిన గ్రామీణ రంగ ప్రజలు లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటోంటే ఈ రోజుదాకా ఒక్క పారిశ్రామిక వేత్త కూడా అప్పులు మాఫీ చేయించుకున్నారే గాని, ఆత్మహత్యలు చేసుకోలేదు. 100 సం॥రాల క్రితం భారతదేశంలో ప్రతి గ్రామంలోను ఒక చెరువు తాగునీటి కోసం, మరొక చెరువు సాగునీటికి, పశువుల కోసం, బట్టలు ఉతకటంకోసం ఉండేవి. ప్రతి సంవత్సరం చెరువు నిండి అలుగుపారి మరొక చెరువులోనికి ప్రవేశించి గొలుసుకట్టు చెరువులు నిండిన తరువాత, వాగులలోనుండి నదులలో కలిసేవి. మొదటి పంచవర్ష ప్రణాళికలోనే తరతరాలనుండి ఉన్న ఈ చెరువులకు మంగళం పాడి పెద్ద ఎత్తున భారీ ప్రాజెక్టుల పేరుతో ఒకే పంట సంస్కృతిని ప్రవేశపెట్టారు. వర్షాకాలంలో వరి, గోధుమ పండించి శీతాకాలం, ఎండాకాలాల్లో తృణధాన్యాలు, పప్పులు పండించడం ద్వారా భూసారం పెంపొందించి ప్రజారోగ్యం కోసం పంటలు పండించే సంస్కృతిని మర్చిపోయి, ఏకపంటను పదేపదే పండించి ఎరువులు, పురుగుమందుల ద్వారా భూసారం నిర్వీర్యం చేయడానికి పట్టణ ప్రాంత శాస్త్రజ్ఞులు ఇతోధికంగా కృషి చేసి గ్రామీణ ప్రాంతాన్ని దివాలా తీయించారు. ఆత్మగౌరవంతో, పాడిపంటలతో కళకళలాడాల్సిన పల్లెలు సహాయం కోసం అర్థించే భిక్షగాళ్ళుగా మార్చేయడం జరిగింది.

చెరువుల్లో, నదుల్లో, సముద్రాల్లో చేపలు పట్టే వలలు పడుగు, పేక మధ్య కనీస విశాలతను ఏర్పాటు చేయడం ద్వారా చిన్న చేపలను పునరుత్పత్తికోసం మిగిల్చే సంస్కృతి లక్షల సంవత్సరాల నుంచి ఉంది. దీనిని నాశనం చేసి ఆఖరి చిరుచేప దాకా మరబోట్లతో, పెద్దవలలతో పట్టేసి అంతర్జాతీయ విపణిలో అమ్ముకొని లాభాలు సంపాదించాలనే సంస్కృతి కూడా ప్రవేశపెట్టబడింది. ఈనాడు గ్రామీణ ప్రాంత మత్స్యకారులకు ఉపాధి లేకుండా చేయడం జరిగింది.

అశోకుడ్ని, అక్బర్ని, రుద్రమదేవి గురించి 50-60 సంవత్సరాల క్రితం చరిత్ర పాఠాలలో బాటకిరువైపులా చెట్లు నాటించారనీ, ప్రతి గ్రామంలోను చెరువులు త్రవ్వించారనీ, పండిన పంటలో కొంత భాగాన్ని మాత్రమే పన్నుగా వసూలు చేసేవారని, అందుకే గొప్ప ప్రభువులయ్యారని చెప్పటం జరిగింది. ఈ రోజు లక్షల హెక్టార్ల అడవులను అభివృద్ధి పేరుతో నాశనం చేస్తున్నారు. స్వతంత్ర్య భారత ప్రభుత్వం ఏదైనా కాని పై విలువలను బోధించే పాఠాలను కూడా పాఠ్యాంశాలుగా తీసివేయడం వారి విలువలను ప్రతిబింబిస్తుంది.

50-60 సం॥రాల క్రితం ప్రతి గ్రామ చావడిలోనో, గుడిదగ్గరో వృద్ధులు, పెద్దరైతులు కూర్చుని వారి అనుభవం ద్వారా గ్రామానికి ఏ పంటలు మంచివి, ఏ పనులు చేయాలి, చెరువులో పూడిక ఎప్పుడు తీయాలి? ఆ వండ్రుమట్టిని ఎలా పంచుకోవాలి? ఇటుకల కోసం ఎంత మట్టిని ఇవ్వాలనే అంశాలను చర్చించేవారు. దీనికి తోడు సాయంత్రం పూట సామాజిక కల్లు, పానశాలల దగ్గర పెద్ద పెద్ద తగువులు ఎలా పరిష్కరించవచ్చో ఆలోచించడం జరిగేది. ఆనాడు ప్రభుత్వం అంటే నాణేలు, రూపాయలు ముద్రించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో పరిష్కరించలేని తగువులు తీర్చేటందుకు, పెద్ద ఎత్తున ఎదైన ప్రజాపనులు రైల్వే లైన్లు, తపాలా ఆఫీసులు మొదలైన వాటికోసమేనని ఎవరైన చెప్పగలిగేవారు. ఈనాడు ప్రజలు ఎన్నుకొన్న సర్పంచ్‌ని ఒక కలం పోటుతో రద్దు చేయగలిగే కలెక్టర్, ఒక్క రూపాయి కూడా గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేటాయించని ప్రభుత్వం, దైనందిన జీవితంలో పాలు నీళ్ళతో సహా ప్రతీ నిత్యావసరాలు కూడా తమ ఆధీనంలో ఉంచుకొని ఒక్కటేమిటి మన జీవితంలో ప్రతి పనిని ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. దీనివల్ల ప్రక్కవారు ఏమైతేనేమి? నాకు తెల్లకార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఇతరేతర ఏవిధమైన ప్రభుత్వ సదుపాయాలు వస్తాయనే పనిలో ఈ రోజు కోట్లమంది భారతీయులు నిమగ్నమైనారు.

పూర్వం నదుల్లో నీళ్ళ మళ్ళింపు కోసం బండరాళ్ళను నదికి అడ్డంగా ఆనకట్టలాగా పేర్చి, గ్రాయిన్లు కట్టి పెరిగిన నీటిమట్టాన్ని వెంటనే కాలువల ద్వారా గొలుసుకట్టు చెరువుల్లోకి పంపి విశాల ప్రాంతాల్లో ప్రతి గ్రామంలోను నీటి నిల్వ చేసేవారు. ఆ చెరువుల్లోని నీరు సాగునీటికి, తాగునీటికే కాకుండా భూగర్భంలోకి ఇంకి చుట్టు ప్రక్కల బావుల్లోకి నీటిమట్టం పైకి తీసుకొచ్చేది. ఈ నీటితో వరి, గోధుమ సంవత్సరానికి ఒక్క పంట మాత్రమే వేసేవారు. అందరూ రెండో పంటగా ప్రత్తి, పెసర, కంది, నువ్వులు, వేరుశనగ, జొన్న, రాగి, సజ్జలు, పిల్లిపెసర మొదలగుపంటలు వేసేవారు. ఈనాడు దీనిస్థానే పెద్ద ఎత్తున నీటిని నిల్వచేసే రిజర్వాయర్లను నిర్మించి, లక్షలాదిమంది ఆస్తులను, ఉపాధిని ఇళ్ళను ముంపుకు గురిచేసి ప్రజలను కాందిశీకులగా ఇతర ప్రాంతాలకు తరిమేస్తున్నారు. కాలువల్లో సిమెంట్ లైనింగ్ చేసి చుక్కనీరు భూమిలోకి ఇంకకుండా చేసి భూగర్భ జలాలను మాయం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ల కింద ఉన్న కొద్దిమంది కాలువ మొదట్లో ఉన్న రైతులు మాత్రం ఖచ్చితంగా రెండు లేదా మూడు పంటలు పండించుకుంటూ, పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలుగా మారే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ విధంగా బహుళార్థసాధక ప్రాజెక్టుల పేరుతో విశాల ప్రజానీకాన్ని దరిద్రులుగా, దిక్కులేనివారిగా, భిక్షగాళ్ళుగా మార్చి తెల్లకార్డులనే ఎంగిలిమెతుకులు విసురుతున్నారు.

ఒకానొకప్పుడు ఎవరి పిల్లవాడు తప్పుచేసినా అదిలించేందుకు ప్రతి ఒక్కరికి అధికారం ఉండేది. ఈ రోజు తప్పుచేసిన వారిమీద పోలీసుస్టేషన్లలోను, కోర్టులోను, అధికారులకో పిర్యాదు చేసినా ముద్దాయి, పోలీసులు కుమ్మక్కయితే వారు పెట్టే బాధలను చూసి ఫిర్యాదుదారుడు పడే అవస్థ చూసి సమాజంలో ఏ తప్పు జరిగిన నాకేం అనే కొత్త సంస్కృతి వేళ్ళూనుకుంటోంది.

మనశరీరం ప్రకృతి ధర్మం ప్రకారం జరుగుతుందని, అది స్వయం రక్షణలో వెనకబడితే ప్రకృతే దానికి కావాల్సిన చికిత్స ఇస్తుందని మిరియాల కషాయం, శొంఠిపూత, రావిచెక్క నీరు, నేల ఉసిరి మందు, మంచిగంధం పట్టీ ఇలాంటి స్థానిక వైద్యంతో లేకపోతే స్వస్థత మనిషికి కల్గించడానికి మనిషి అలవాట్లను విచారించి, శరీరతత్వం కనుగుణంగా హోమియో వైద్యం చేయటం జరిగేది. ఇవన్నీ చౌకగా, స్థానికంగా లభ్యమయ్యేవి. ఈనాడు రొంప దగ్గరనుండి కడుపుమంట దాకా అన్నింటికి ప్రభుత్వ వైద్యశాలకు పరిగెత్తాలి. వారు ప్రైవేట్ వైద్యశాలకు, ఆరోగ్యశ్రీ కార్డుద్వారా రిఫర్ చేయడం, ఈ ప్రైవేట్ ఆస్పత్రులు అవసరం ఉన్నా లేకపోయినా 20-30 రకాల పరీక్షలు చేయడం, ఏ మాత్రం అవకాశం ఉన్నా రెండు, మూడు కుట్లు వేసి, దీనికి లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోంది. దీనికి తోడు తిరుగుడు, హోటళ్ళు, లంచాలకు ఖర్చవ్వాలి. గ్రామీణ ప్రాంతం దివాలా తీయాలి. ఇది ఈనాటి స్థితి.

స్థూలంగా చెప్పాలంటే నేటి అభివృద్ధి నమూనాలో వయస్సుకు గౌరవం లేదు, మాటకు గౌరవం లేదు, అనుభవానికి గౌరవం లేదు, ఆడినమాటకు గౌరవం లేదు, స్థానిక పెద్దలకు గౌరవం లేదు. చిన్న చెరువులంటే, చేతివృత్తులంటే గౌరవం లేదు. బహుళపంటల వ్యవసాయం అంటే గౌరవం లేదు. ధర్మం, తరతరాల ఆలోచనలు ప్రతిబింబించే భారతీయ సంస్కృతంటే గౌరవం లేదు. సాటిమనిషిని మనిషిగా చూడాలనే ఆలోచనలేదు. ఇతర కులాలను, ఇతర మతాలను, స్త్రీ, పురుషులను సమానంగా చూడాలనే భావన మనసులోనే లేదు. దీనికి ప్రత్యామ్నాయం స్థానిక వనరుల పై ఆధారపడిన, స్థానిక గ్రామీణ ప్రభుత్వాలే, చిన్న చెరువులే, స్థానిక చేతివృత్తులే, స్థానిక బజార్లే, స్థానిక ఉత్పత్తుల వినియోగమే, ఒక్కమాటలో లోకవిద్యే మన సంస్కృతిని విలువల్ని కాపాడ కలుగుతుంది.

- టి. నారాయణరావు

# ప్రపంచీకరణ - పౌర ఉద్యమ నిర్మాణావశ్యకత

ఈ మధ్య జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ 'అభివృద్ధి' అనే అంశాన్ని ముఖ్య ఏజెండాగా ప్రజలముందుంచి 'అలయన్స్' సభ్యుల అండలేకుండా స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల 'మెజారిటీ'ని సాధించింది. అంతకు ముందు అధికారంలో ఉన్న యు.పి.ఎ ప్రభుత్వం, అవినీతి ఆర్థిక స్కాములతో కూరుకునిపోయి నామమాత్రపు మెజారిటీతో పాలించింది. అధిక ధరలతో సామాన్య ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంకావడం, క్షీణిస్తున్న రూపాయివిలువ, పెరిగిపోతున్న నిరుద్యోగం, రైతులకు గిట్టుబాటు ధరలు లభించని వ్యవసాయం మొదలైనవన్ని ప్రజలు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపక్షాలను తిరస్కరించి కోటి ఆశలతో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది. తదనుగుణంగా ప్రజాకాంక్ష మేర నూతన ప్రభుత్వం ప్రజాసంక్షేమ చర్యలకు శ్రీకారం చుట్టవలసి ఉంది.

మరోవైపు 'అభివృద్ధి' ఎవరికి అనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారతదేశంలో ప్రపంచీకరణ ఫలితంగా సన్న, చిన్నకారు రైతాంగం, చేతి వృత్తులవారు, దళిత, గిరిజన వర్గాలకు యింతవరకు ఎటువంటి 'అభివృద్ధి' ఫలాలు అందలేదనేది నిర్వివాదాంశం. ఈ వర్గాలు ప్రభుత్వ పరంగా లభించే సబ్సిడీలు, ఇతర సంక్షేమ పథకాల కోసం నిరీక్షించే 'బిచ్చగాళ్ళ' వర్గంగా తీర్చిదిద్దబడటం జరిగింది. ఇంకా చెప్పాలంటే అధికార పార్టీకి ఓటు బ్యాంకులుగా పరిగణించబడటం జరిగింది. ప్రపంచ బ్యాంకు షరతులకు ఈ రకమైన ఆర్థిక సాయాలు సరిపడవు. తదనుగుణంగానే సంక్షేమ పథకాలను పెద్దగా కుదించడమో లేక పూర్తిగా రద్దు చేయాలనే వాదనలు బలం పుంజుకుంటున్నాయి. ప్రభుత్వం ఏదైనా, దానివిధానాలు ప్రపంచ బ్యాంకు షరతులతో కూడిన 'ప్రపంచీకరణ' అనబడే ఆర్థిక వ్యవస్థను దేశంలో ప్రవేశపెట్టబడటం ద్వారా లాభపడేది పెట్టుబడి దారి, వ్యాపార వర్గాలు మాత్రమే! భారత రాజ్యాంగంలో పొందుపరిచిన 'ఆదేశిక సూత్రాలు' ఇక అజాగళస్తనాల లాగా మిగిలిపోతున్నాయి. సామాన్య ప్రజానీకం యింతకు ముందు 'హక్కు'గా అనుభవిస్తున్న, వైద్య, విద్య, సంక్షేమరంగాలన్ని 'ప్రైవేట్'పరం కాబడి, కొద్దిమంది వ్యక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసిన పరిస్థితి క్రమంగా కల్పించబడుతోంది. అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగా స్వదేశి పరిశ్రమ విధానాలు రూపొందించబడటంతో దేశంలోని చిన్న పరిశ్రమలు మూతపడాల్సి వస్తుంది. వ్యవసాయం, దాని ఆధారిత పరిశ్రమలు నిలదొక్కుకోలేని పరిస్థితులు కల్పించబడి స్వావలంబన మృగ్యమై సామాన్య ప్రజానీకం నిస్సహాయులుగా నిలవాల్సిన పరిస్థితులేర్పడతాయి.

వచ్చిన చిక్కేమంటే, ప్రజా సమస్యల్ని చర్చించి సానుకూల పరిష్కారాలు సూచించగల 'పార్లమెంట్'లో క్రమేణా పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపారులు, కోటీశ్వరులతో నింపబడటం మనం చూస్తున్నాం. ఏ వ్యక్తి తన స్వప్రయోజనానికి భిన్నంగా నిర్ణయాలుతీసుకోడనేది తిరుగులేని సత్యం అయినపుడు, పై వర్గాల వారు సామాన్య ప్రజల కనుకూలంగా 'చట్టాలు' చేస్తారనుకోవడం విజ్ఞత కాదు.67 సంవత్సరాల సంపూర్ణ స్వాతంత్ర్యం, తద్వారా పౌరులుగా వారికి లభించిన 'ఓటు' హక్కును 'డబ్బుకు' మత, కుల ప్రలోభాలకు తాకట్టు పెట్టగలిగిన స్థితిలో ఉండటం అత్యంత విచారకరం. ఈ ఎన్నికలలో ప్రలోభాలకు వాడటానికుద్దేశించిన డబ్బు పెద్దమొత్తాలో పట్టుబడడటం దేనికి నిదర్శనం? ప్రజాప్రతినిధులు ఎన్నికవడానికి పెద్ద మొత్తాల్లో పెట్టుబడి పెట్టడం నేటి భారత ప్రజాస్వామిక వ్యవస్థలో వేళ్ళూనుకుంటున్న నూతన పరిణామం. 'డబ్బు' మాత్రమే ఎన్నికలకు ప్రధాన అర్హతగా మిగిలినపుడు ఇక సామాన్య పౌరులకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం ఎలా ఉంటుంది.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల వలస విముక్తి తరువాత అమెరికా, యూరోపియన్ దేశాలు ప్రత్యక్ష దోపిడిస్థానేపరోక్ష దోపిడి కుట్రలో భాగంగా ఆయా దేశాల ఆర్థిక అభివృద్ధి పేరిట, షరతులతో కూడిన అప్పులిచ్చి, ఆర్థిక విధానాలను నిర్దేశించటమే ప్రపంచీకరణ లక్ష్యం. తమ దేశాల్లో తయారయ్యే సరకులకు ప్రపంచ మార్కెట్‌ను సృష్టించడం ద్వారా, స్వదేశి పరిశ్రమలను దెబ్బతీయడం. అప్పుల చెల్లింపుకుగాను తమకు ఏరకం సరుకులు ఎగుమతి చేయాలో నిర్దేశించిన ఫలితంగా నేడు ఆహార పంటలు పండించే భూముల్లో పండ్లతోటలు, పూల తోటలు, బయోఫ్యూయల్ అందించగల పంటలకు ప్రభుత్వ ప్రోత్సహకాలు ప్రకటించబడ్డాయి. పారిశ్రామికీకరణ యుగం, యూరవ్, అమెరికాలలో ఊపందుకోని దశలో, ఆయాదేశాల్లో కూడా వ్యవసాయం, చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే సమాజం ఒకటుందని మనం మర్చిపోకూడదు. అయితే పారిశ్రామీకరణ క్రమంగా ఆ వృత్తులను మింగివేసి ఆ వృత్తుల మీద ఆధారపడి జీవించేవారిని 'ఫ్యాక్టరీ' కార్మికులుగా మార్చి వేసింది. భారతదేశం దీనికి మినహాయింపేమీ కాబోదు. వ్యవసాయం ఒక పరిశ్రమంగా మార్చివేయబడ్డప్పుడు చిన్న వ్యవసాయ భూకమతాలు వేల ఎకరాల 'సెజ్'లుగా మార్పు చెందినపుడు సన్న, చిన్నకారు రైతులు తమ ప్రాంతాలోనే 'దినసరి' కూలీలుగా మార్చబడతారు. ఇదే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పలుగు పార వారికి మాత్రం నిర్దేశించబడింది. ఒక వైపు దేశంలో గణనీయ సంఖ్యలో దేశ జనాభా పోషకాహార లోపంతో, తద్వారా అనారోగ్యాలకు గురవుతున్నారనిఅన్ని సర్వేలు చెపుతుండగా 'డాలర్ల' సంపాదించగల పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలివ్వడం గల ఔచిత్యాన్ని ప్రశ్నించవలసి ఉంది.

ఒకసారి ప్రపంచీకరణలో భాగంగా మారి, ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి, దాని ఆదేశాల అమలుకునడుం బిగించినాక దేశ పారిశ్రామిక రంగం 'ప్రైవేట్'పరంకాక తప్పదు. పెట్టుబడి, సర్వీసు రంగాలు (బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వేలు, విద్యుత్ మొదలైనవి)ప్రైవేటీకరణకు ప్లానులు సిద్ధం చేయబడుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల పనితీరుపై విశ్లేషణలు మొదలై వాటి పని తీరు మెరుగుపరచడానికి ప్రైవేటీకరణే ఏకైక మార్గమనే ప్రచారం ఊపందుకుంటుంది. దీనికి ఉదాహరణ రక్షణరంగంలో ప్రైవేటీకరణ అనుమతే.

అయితే ఇంకోవైపు ప్రపంచీకరణ దుష్ఫలితాల్ని ఎండగడుతూ యూరప్ దేశాలు, గ్రీసు, కొరియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలలో పెద్ద ఎత్తున 'పౌర సమాజాల'ద్వారా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచవాణిజ్య ఒప్పందాలు అభివృద్ధి చెందిన దేశాలకు అనుగుణంగా చేయడాన్ని అవి ప్రశ్నిస్తున్నాయి. ఉదాహరణకు ఒక పక్క అమెరికా తన దేశంలోని రైతాంగానికి సబ్సిడీల ద్వారా గిట్టుబాటు ధరలు కల్పిస్తూ మిగిలిన వెనుకబడిన దేశాల్లో ఆ పద్ధతికి ప్రపంచబ్యాంకు షరతుల ద్వారా అడ్డుపడటం. 'పౌర సమాజం' అనేది భారత ప్రజలకు బొత్తిగా పరిచయం లేని పదం. 'కులసమాజం' దాని అత్యున్నత భావజాలం. దానిఅభివృద్ధి కూడా కులం గోడల్ని దాటిచూడటానికి ఇష్టపడదు. దేశంలో 65 శాతం ప్రజలతో కూడిన గ్రామీణ రైతాంగం, చేతి వృత్తులు ఇతర భూమిలేని వర్గాల ఉనికి ప్రశ్నార్థకరంగా మారబోతున్న సమయంలో వాళ్ళింకా మత, కుల ఉచ్చులలో చిక్కుకుని ఉండటం విచారకరం. 67 సంవత్సరాల సంపూర్ణ స్వాతంత్ర్యం తరువాత గూడా తాము ఒకదేశ పౌరులమన్న భావనకు రాకుండా, కులంలోనే తమ వ్యక్తిత్వ గుర్తింపును కోరుకునే స్థితిలో ఉన్న సమాజం కలసికట్టుగా తమ మనుగడకు ఏం పోరాడగలదు? 'సయామి' లాగా పెనవేసుకున్న కుల, వృత్తి సమాజం విడివిడిగా తమ ఉనికి కోసం ప్రదర్శనలను జరుపడం మనం చూస్తున్నాం. ఈ వర్గాలను ఒకే గొడుగు క్రిందకు చేర్చగల పౌర సమాజాల్ని నిర్మించవలసిన అగత్యం ఉంది. సామాన్య ప్రజల జీవితాల్ని అతలాకుతలం చేసే విధానాలు చట్టబద్ధంగా ప్రవేశపెట్ట బోతున్నప్పుడు దేశ సహజ వనరులు దోపిడికి గురవుతున్నప్పుడు, రాజ్యాంగంలో పొందుపరచిన వైద్య, విద్య, ఆహార భద్రతల విఘాతం కలుగబోతున్నప్పుడు గొంతెత్తలేని ప్రజానీకం జీవచ్ఛవాలుగా బ్రతుకులు వెళ్ళమార్చాల్సిన పరిస్థితులు మనసారా ఆహ్వానిస్తురన్నమాట. అయితే తక్షణ ప్రాముఖ్యం గల ఈ అంశాలను ప్రక్కనపెట్టి, చరిత్రను తిరగదోడి, తమ స్వంత అభిప్రాయాలను ప్రచారంలోకి తేవడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించే వర్గాలకు ఈ దేశంలో కొదవేమీ లేదు. వాళ్ళు అక్రమిత కాశ్మీర్ గురించి, ఆర్టికల్ 370 గురించి, ఉమ్మడి సివిల్ కోడ్ గురించి, యుద్ధంలో చైనా ఆక్రమించిన భూభాగాన్ని గురించి పత్రికల ద్వారా 'ప్రజాభిప్రాయ' సేకరణకు ఉపక్రమించడం జరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థానే జాతీయ ఉన్మాదాన్ని దేశ ప్రజల తలకెక్కించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమాజంలో తీవ్రకల్లోలాన్ని అశాంతిని తద్వారా హింసను ప్రేరేపించడం ఆపగలమా? విభిన్న సంస్కృతులకు, ఆచారాలకు నిలయంగా కొన్నివేల సంవత్సరాలుగా కలిసి మనుగడ సాగిస్తున్న ఈ దేశ ప్రజల్ని నిట్టనిలువునా మత కుల వర్గాలుగా చీల్చడానికి ప్రయత్నాలు ఆపాలి. ఈ శక్తుల పట్ల ప్రజలు, ప్రసార సాధనాలు అప్రమత్తంగా ఉండి దేశ శాంతికి విచ్ఛిన్నకరంగా ఉండే భావజాలానికి వాహికలుగా మారకపోవడం మంచిది.

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణలో భాగంగా దేశ సహజ వనరులను, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించడం, వేల సంవత్సరాలుగా చిన్నకమతాల్ని నమ్ముకున్న రైతాంగాన్ని వ్యవసాయం వదలుకోవాల్సిన స్తితికి నెట్టడం, వ్యవసాయాధారిత గ్రామీణ చేతివృత్తుల, నిరుపేదల జీవనోపాది ఉసురుతీయడం, అడవి బిడ్డల్ని అభివృద్ధి పేర వారి నివాస స్థలాల నుండి తొలగించడం ప్రకృతి సహజంగా లభించే స్వచ్ఛమైన గాలి, నీరు విషతుల్యం చేయడం వంటి వాటిని ప్రజలే నిరోధించాలి. మూకుమ్మడి నిరసనలే ఈ ప్రజా వ్యతిరేక చర్యల్ని అడ్డుకోగలవు. అది ఒక్క పౌర ఉద్యమాల ద్వారానే సాధ్యపడగలదు.

**- ఐ. నాగేశ్వరరావు**

# విదేశీ కంపెనీల గుప్పిట్లోకి విద్యుత్‌రంగం

సంక్షేమ రాజ్యంలో సేవారంగాల మాట అటుంచండి. ప్రభుత్వ ఆజమాయిషిలో ఉండాల్సిన ముఖ్యమైన పరిశ్రమలు, విద్యుత్, మంచినీరు రక్షణరంగం మొదలైనవి ప్రయివేటు పరంచేస్తే జరిగే అనర్థాలకు ఎవరు బాధ్యత వహించాలి? ప్రభుత్వాలు మారినా విధానాల్లో మార్పుండదనడానికి ఉదాహరణ విదేశి కంపెనీలకు విద్యుత్ ప్రాజెక్టులు కట్టబెట్టడం. చరిత్ర మనకు గుణ పాఠాలు నేర్పుతుందంటారు. యిది అన్ని దేశాలకు వర్తించే సూక్తి. అయితే మనం 'అభివృద్ధి' అనే 'ఉన్మాదం'లో మంచి చెడులను బేరీజు వేయలేకపోతున్నా మనిపిస్తుంది. బ్రిటీష్ ఇస్టిండియా కంపెనీ వ్యాపార మిషతోనే ఈ దేశంలో కాలూని దేశాన్ని వలస రాజ్యంగా మలచుకొని పరిశ్రమలలో ఎగుమతి స్థానంలో ఉన్న (చేనేత, స్టీలు, జనపనార) మనల్ని, చివరకు ఇసుక సైతం దిగుమతి చేసుకొనే స్థితికి తెచ్చింది. కుటీర పరిశ్రమలను నాశనం చేసింది.

విధిలేని పరిస్థితులలో వలసలను వదులుకోవాల్సిన యూరోపియన్‌దేశాలు తాము పీల్చి పిప్పిచేసిన దేశాలకు తమచే నెలకొల్పబడ్డ ప్రపంచబ్యాంక్ ద్వారా షరతులతో కూడిన రుణాల 'ఎర'ను వేసి సరళీకృత ఆర్థిక సంస్కరణల పేరిట మానవత్వం లేని గ్లోబలైజేషన్‌ను తెరపైకి తెచ్చింది. ప్రపంచదేశాలను అభివృద్ధి చెందినవిగా, చెందనివిగా విభజించింది. ఇది వలసవాదానికి తద్వారా దోపిడికి పన్నిన కుట్రగా గుర్తించే లోపే కాలు వెనక్కు తీసుకొనే పరిస్థితి లేకుండా చేసింది. లేకపోతే అత్యంత ప్రాముఖ్య రంగమైన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్టులను దేశీయ కంపెనీలు విదేశీ కంపెనీలకు అమ్ముకుంటున్నాయి. అయితే దానికి చెప్పే కారణాలు సజావుగా కనిపించడంలేదు. దేశంలో బొగ్గు ఆధారిత ఎలక్ట్రికల్ పవర్ వాటా 59 శాతంగా ఉన్నప్పుడు 'బొగ్గు గనులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు, ప్రైవేట్ రంగంలో బొగ్గు వినియోగంద్వారా 'కరెంటు' ఉత్పత్తి జరగడానికి 'చట్టాలు' పచ్చజెండా ఊపినప్పుడు, సముద్ర మధనంలో 'హాలాహలం'లా అవినీతి పెల్లుబుకడంలో ఆశ్చర్యపోవాల్సిన విషయమేమీకాదు. కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ పార్లమెంటుకు సమర్పించిన తన రిపోర్టులో పారదర్శకత పాటించకుండా 2004లో ఇంధన శాఖ తీసుకున్న 'బహిరంగ వేలం'అనే విధాన నిర్ణయానికి వ్యతిరేకంగా బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు నామినేషన్ ద్వారా కట్టబెట్టడం ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నష్టం 1.67 లక్షల కోట్లుగా లెక్కతేల్చారు. తరువాత 23 ఏప్రిల్‌న 2013 ఏర్పడిన పార్లమెంటరి స్టాండింగ్ కమిటీ రిపోర్టు ప్రకారం 1993-2004 మధ్యకాలంలో బొగ్గుబ్లాకుల కేటాయింపు ఎటువంటి ప్రకటన ద్వారా ప్రజల దృష్టికి రాకుండా, పారదర్శకత లేని కేటాయింపులు జరిగినట్టు తేల్చింది. చిత్రమేమిటంటే ఈ

కాలంలో ఎన్.డి.ఎ/యు.పి.ఎ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. అంటే రాజకీయ పక్షాలు దేశ సహజవాయు, ఖనిజ సంపదలను తమకు ఇష్టులైనవారికి, ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకుంటున్నాయన్నమాట.

అయితే దానికి చెప్పే కారణాలు డొంకతిరుగుడుగా ఉంటాయి. డిశంబరు 2011 నాటికి 30 కోట్లమంది భారతీయులకు కరెంటు సరఫరా అస్తవ్యస్తంగా ఉండేది. భారతీయ గ్రామీణ ప్రాంతాలలో 33 శాతం, పట్టణాలలో 6 శాతం ప్రజలకు కరెంట్ ఉండేదికాదు. ఉత్పత్తి, డిమాండ్‌లో ఉన్న తీవ్ర వ్యత్యాసం వల్ల వ్యవసాయరంగం, ఉత్పత్తి రంగాలు దెబ్బతింటున్నాయి. నిజమే కాని సంక్షోభాన్ని పరిష్కరించడానికి విద్యుత్ ఉత్పాదన లాంటి కీలక రంగాలను విదేశీ కంపెనీలకు కట్టబెట్టడం ఏమాత్రం సరికాదు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రైవేటు కంపెనీలు తమకు బొగ్గు సప్లయి లేదని, అందువల్ల తాము అప్పుతెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేక, గత్యంతరం లేక అమ్ముకోవాల్సి వస్తుందంటున్నారు. కొన్ని కంపెనీలయితే ఏ బొగ్గు మీద ఆశతో తాము పరిశ్రమను స్థాపించదలచుకొన్నారో వాటికి భూసేకరణ, పర్యావరణ అనుమతులు లభించడంలేదని అంటున్నారు. భూగర్భ వనరుల వినియోగంలో భారతదేశంలో పరిశ్రమ స్థాపకులు రాష్ట్ర, కేంద్ర అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే వాళ్ళి అనుమతులు ఎందుకు తీసుకోలేకపోయారు. ముంజేతి కంకణాన్ని అద్దంలో చూడాల్సిన అవసరంలేదు. అన్నీ ఉన్నా మొత్తం వ్యవస్థనే అవినీతిమయంగా మార్చిన ఈదేశ పాలకవర్గాలుగా ఉన్న రాజకీయ పార్టీలు దోషులుగా 'బోను'లో నిలవాల్సిన పరిస్థితి మతం, కులం పేరిట కొట్లాడుకునే ప్రజలు, డబ్బుకు ఓట్లమ్ముకునే ప్రజలు, సత్యాలు గ్రహించే స్థితిలో ఉండరు. లేకపోతే మొన్నటి పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికలలో వందలకోట్ల ఆస్తి ఉన్న కోటీశ్వరులను తమ ప్రతినిధులుగా ఎన్నుకొని ఉండేవారు కాదు. పంతుళ్ళను, పాత్రికేయులను, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు మరియు ప్రధానంగా సంఘ సేవకులకు ఈ రోజు అసెంబ్లీలలోకాని, పార్లమెంటులోకాని నిజమైన ప్రజాసేవకులకు, ప్రజా సమస్యలపై పోరాడేవారికి స్థానం లేదు.

భారతదేశాన్ని కొద్దిమంది ఉన్నత శ్రేణి పెట్టుబడిదారి వర్గం చేతుల్లోకి అధికారం ప్రజాస్వామ్య ముసుగులో దఖలు పరచడం జరిగింది. మానవ బలహీనతలను ఓట్లుగా మలచుకోవడంలో వారు సఫలమయ్యారు. వారి ఎజెండా 'ప్రపంచీకరణ'. దాన్ని అమలుజరపడానికి దేశ ప్రజల సంక్షేమంతోదానికి పనిలేదు. అయితే కొత్త బొగ్గు గనులు తవ్వడానికి అవి గిరిజన అటవీ ప్రాంతంలో ఉండటంతో పర్యావరణ శాఖ అనుమతులు కొద్దిగా ఆలస్యంకావచ్చు. ఇప్పుడు ఈ విద్యుత్ ప్రాజెక్టులు విదేశీ కంపెనీల చేతుల్లోకి వెళ్ళినాక ఇంతకుముందు చెప్పిన ఇబ్బందులు ఉంటాయి. అయితే వాటిని అధిగమించేందుకు దేశీయ కంపెనీలకు మైనార్టీ వాటాలను ఉంచుతారు. ఈ మైనార్టీ వాటా వాళ్ళే ప్రభుత్వానికి, విదేశీ కంపెనీలకు బ్రోకర్లుగా మారి ఎవరి వాటా వాళ్ళకిచ్చి అనుమతులు సంపాదిస్తారు. మనకున్న ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ విదేశీ కంపెనీల వివరాలివి. (1) సెంబ్‌కార్ప్ - సింగపూర్ - 2650 మెగావాట్ల సామర్థ్యం (2) టాకా - అబుదాబి - 1741 మెగావాట్లు (3) జి.డి.ఎఫ్ సూజ్ - ఫ్రాన్సు - 900 మెగావాట్లు. ఇక ప్రాజెక్టు నడపలేమని నష్టాల్లో ఉన్నామని అమ్మకానికి సిద్ధంగా ఉన్న కంపెనీలు (1) జి.ఎం. ఆర్ గ్రూపు - రుణభారం 40,000 కోట్లు (2) ల్యాంకో ఇన్‌ఫ్రా - రుణభారం 36558 కోట్లు (3) గాయత్రి ప్రాజెక్టులు - రుణభారం 1400 కోట్లు.

సామాన్య ప్రజలుగా మనం ఆలోచించేదేమిటంటే విదేశీ కంపెనీల చేతికి విద్యుత్ వ్యవస్థ పెడితే అవన్నీ ఒక జట్టుగా ఏర్పడి విద్యుత్ టారిఫ్‌లను తమ ఇష్టానుసారంగా పెంచే ప్రమాదం ఉంది. ప్రపంచీకరణలో భాగంగా ఈ ఒప్పందాలు జరుగుతాయి. కాబట్టి ఈ విదేశీ కంపెనీలు ప్రభుత్వ అభ్యంతరాలను పెద్దగా పట్టించుకోనవసరం ఉండదు. ఒక వైపు రాజ్యంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలను కాలరాస్తూ విద్య, వైద్య రంగాలను క్రమేణా ప్రైవేటు పరంచేస్తూ రైతులు, చేతివృత్తులవారు, కూలీలు, మధ్యతరగతి ప్రజానీకపు మనుగడను ప్రశార్థకంగా మార్చుతున్న ఈ ప్రభుత్వ విధానాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అవి పార్లమెంటులో జరుగుతాయన్న భ్రమలు అర్ధరహితం.

అభివృద్ధి చెందదలుచుకున్న ఏ దేశం తమ సహజ వనరులైన బొగ్గు, గ్యాస్ లాంటి వాటిని విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేయదు. కీలకరంగమైన 'విద్యుత్ ప్రాజెక్టులను ఈ దేశ నిపుణులే నిర్వహించగలరు. అయితే ప్రపంచ బ్యాంకు ప్రభుత్వ రంగ సంస్థల ఉనికిని సహించలేదు కాబట్టి వాళ్ళ షరతుల ప్రకారం విద్యుత్ ప్రాజెక్టులు విదేశీ సంస్థలకు అప్పగించడం జరుగుతోంది. యిక ప్రభుత్వాల దగ్గర రక్షణ, పోలీసు, జైళ్ళు, కరెన్సీలాంటి శాఖలే ఉండబోతాయి. ఎందుకంటే పాలకులకు కావల్సినవి ఆ శాఖలే. 'ప్రపంచీకరణ' ముసుగులో ఈదేశ సామాన్య ప్రజానీకం పై జరుగుతున్న ఈ కనబడని 'కుట్ర'ను ఎంత తొందరగా గుర్తించి, భారీ ఎత్తున ప్రజానిరసనను తెలపడానికి ఇది సరైన సమయం లేకపోతే ఇటువంటి అనర్థాలు ఎన్నో జరిగిపోతాయి.

ఈ వ్యాసాన్ని ప్రచురణకు ఇచ్చే ముందువార్త. రక్షణరంగాలో కూడా పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాల్సిందేనని విదేశీ పెట్టుబడులతో భారతదేశం అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం అధికార ప్రతినిధుల ద్వారా అన్ని టీవీ చానల్‌లో (మన తెలుగు చానల్స్‌తోసహ) పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. తొందరలోనే విదేశీ పెట్టుబడి, రక్షణ, రైల్వే శాఖలలో ప్రవేశపెట్టడానికి తద్వారా భారతదేశం తాకట్టులోకి వెళ్ళబోతోందని సంకేతాలు వస్తుండటంతో ప్రజాందోళనలు తప్పవు.

**- ఐ. నాగేశ్వరరావు**

# ఎడారి భూతాన్ని ఏడు నిలువుల లోతునా పాతిపెట్టాలి

గత 14 ఏండ్ల (2000 సం॥ నుండి) వాన రికార్డును చూస్తే ఒకే ఒక్క సం॥రం (2011) మిగతా అన్ని సంవత్సరంలలోనూ మస్తుగా వానలుపడ్డాయి. ప్రతి సంవత్సరం 10 దుక్కుల నుండి 20 దుక్కులకు సమానమయిన పెద్దవానలు పడుతూనే ఉన్నాయి. అయినా భారీ తుఫాన్లు వచ్చినపుడు మాత్రమే భారీగా భూగర్భజలం, ఉపరితల జలం ఏర్పడుతుంది. లేదంటే హళ్ళికి హళ్ళి. సున్నకు సున్న. ఎందుకు?

ఇప్పుడో దుక్కివాన, అప్పుడో రెండు దుక్కులు, మరెప్పుడో నాలుగు దుక్కుల చొప్పున "బడబడా" పెద్దవానలు పడితే - ఏ వానకు ఆ వాననే ఏడారిభూతం గుటకాయస్వాహా చేస్తుంది. ఇక నీల్లెక్కడి నుంచి వస్తాయి?

గత కొంతకాలంగా మనం భూమిని నిట్టనిలువునా పై నుంచి కిందికి ఏడు నిలువుల లోతునా ఎండబెట్టాం. ఇలా ఎండిపోయిన భూమినుంచే ఎడారి భూతం పుట్టుకొచ్చింది. దూరదూరంగా - విడివిడిగా - వడివడిగా పడే పెద్దవానల్లో పెద్దభాగం నిట్టనిలువనా ఎండిన భూమిని తడిచెయ్యడానికే - ఎడారి భూతం దప్పిక తీర్చడానికే సరిపోతుంది. ఇక నీల్లెలా ఏర్పడతాయి? సాధారణ వర్షపాత సంవత్సరములలో భారీ తుఫాన్లు మోసుకొచ్చే 10 దుక్కుల వానకంటే రెట్టింపు వానలుపడ్డా (20 దుక్కులు) అరకొరగా మాత్రమే నీళ్ళు ఏర్పడుతున్నాయి. ఎడారి భూతం వాననూ, వాన నీళ్ళనూ మింగేసి మనకు కరువునూ, కన్నీటినీ మిగులుస్తుంది. వానలుంటాయి. పెద్ద పెద్ద వానలుంటాయి. నీళ్ళే వుండవు.

**ఎడారి భూతాన్ని భారీ తుఫాన్లే లొంగదీయగలవు!**

భారీ తుఫాన్లకు రెండు ప్రత్యేక లక్షణాలున్నాయి. ఒకటి 10 దుక్కుల వానను రెండు, మూడు రోజుల్లోనే ఒంపేస్తాయి. ఒంపేయడంలోనూ ఓ ప్రత్యేకత వుంది. గంటలకొద్దీ నాన్పుడు వాన పడుతుంది. మధ్యమధ్యలో కాసేపు పెద్ద తెప్పలు వస్తాయి. నాన్పుడు వానవల్ల మొదట భూమి నిలువెత్తునా తడిసి ముద్దవుతుంది. ఆపైన కురిసే వానంతా నీల్లవుతాయి. గత అక్టోబరు తుఫాను ఏకధాటిగా 50 గంటలపాటు వర్షించింది. భూమి కడుపునిండా నీళ్ళు తాగింది. లోతట్టు ప్రాంతమంతా నిండుకుండలా అయ్యింది. నగానికి నగం నీళ్ళు దిండిపాలయ్యాయి. దిండి పాలయిన నీళ్ళను గడ్డల్లోనే ఆపితే - భూమిలోకి పంపిస్తే - గడ్డలు గూడ నిండుకుండలా అయ్యేవేగదా? గడ్డల్లోనూ నీళ్ళు పుష్కలంగా దొరికేవే గదా?

అక్టోబరు తుఫాను మనకు ఓ విలువైన పాఠాన్ని నేర్పుతుంది. 10 దుక్కుల వానను నీళ్ళుగా మార్చుకుంటే చాలు. ఇక ఏ రైతుకైనా ఏ గడ్డమీదున్నా ఏ ఏడాదయినా పుష్కలంగా నీళ్ళు దొరుకుతాయి.

**ఎడారి భూతాన్ని ఏ రైతుకారైతే ఎవరిపొలంలో వాళ్లే ఏడు నిలువుల లోతునా పాతిపెట్టాలి.**

తుఫాన్లు ఎడారి భూతాన్ని లొంగదీస్తాయి. నిజమే. కాని ప్రతి సంవత్సరం తుఫాన్లు రావాలంటే వస్తాయా? గత 14 ఏండ్లలో తుఫాన్లు నాలుగేండ్లలోనే వచ్చాయి. ఏ రెండేళ్ళకో, మూడేళ్ళకో లేదంటే నాలుగేళ్ళకో ఓమారు భారీ తుఫాన్లు వస్తున్నాయి. భారీ తుఫాన్లు వస్తే పండగ. లేదంటే మన వ్యవసాయమంతా - బతుకంతా దండగ దండగే. ఎడారి భూతాన్ని పాతరేస్తే చాలు. ఏ ఏడాదయినా తుఫాను సంవత్సరాలలో లాగానే పుష్కలంగా నీళ్ళు దొరుకుతాయి.

ఏ రైతుకారైతే కదిలి - ఎవరి పొలంలో వాళ్ళే వానను పట్టుకుని నీళ్ళుగా మార్చుకోవాలి. కుండను నింపుకున్నట్లు భూమిని నీళ్ళతో నింపుకో. కుండ నుంచి నీళ్ళను తీసుకున్నట్లు భూమినుంచి నీళ్ళను తీసుకొని వాడుకో. నిజానికి ఎవరి పొలాన్ని వాళ్ళు నీళ్ళ ట్యాంకుల్లా మార్చుకోవచ్చు. అదే చేస్తే బోర్లే అవసరం లేదు సుమా!

**వర్షపు నీళ్ళను ఎలా పట్టుకోవాలి?**

1) ప్రతీ రెండు, మూడు ఎకరాలకు ఒక కుంటను కట్టుకోవాలి. 10 ఎకరాలు ఒక్కచోట వుంటే రెండు కుంటలయినా వేసుకోవాలి. ఎక్కడపుట్టిన నీళ్ళను అక్కడే - ఎప్పుడు పుట్టిన నీళ్ళను అప్పుడే భూమిలోకి పంపించెయ్యాలి. ఎంత భారీ వర్షం పడ్డా పొలం హద్దులను దాటి ఒక్క చుక్క నీటినీ బయటకు వెళ్ళనీయవద్దు.

2) యావత్తు పొలాన్నీ పెంటగడ్డ చెయ్యాలి. ఓ ఏడాది రెండేళ్ళలో అయ్యేపనిగాదిది. కాలక్రమేణా పెంటగడ్డ చేస్తేచాలు. పెంటగడ్డ నీళ్ళు తాగుతుంది. దానికింది భూమికీ నీళ్ళు తావుతుంది. నీళ్ళను ఆవిరి కానియ్యదు. తేమను పట్టుకొని వుంటుంది కాబట్టి - వానలున్నా లేకున్నా - పంటలు నెగ్గుతాయి. నీళ్ళు పెట్టేదయితే - పంట నీళ్ళ డిమాండు పావలాకి తగ్గిపోతుంది.

3) పగలు, రాత్రి ఉష్ణోగ్రతలను 5 డిగ్రీ సెంటీగ్రేడులున్నా తగ్గించాలి. ఎకరాకు 80 పాత మునగచెట్ల చొప్పున వేద్దాం. వీటికింద ఏ పంటనైనా వేసుకోవచ్చు. పాక్షిక నీడవల్ల నీటి ఆవిరి తగ్గుతుంది. ఉష్ణోగ్రతలూ పడిపోతాయి. భూమికి ఆకులాభం. రైతుకు మునగ పంట లాభం.

4) ఎండాకాలం భూమికి పచ్చగొడుగు పట్టాలి. మునగ చెట్లకు తోడు - ఎండాకాలం గూడ బతికి బట్టకట్టగలిగే పాత ఆముదం, సుబాబులను పత్తి యితరత్రా పంటలతోపాటు దండిగా పెంచితే ఎండాకాలం భూమికి నిండా నీడనిస్తాయి. భూమిలో తేమ యిక ఆవిరి అయిపోయ్యే ప్రశ్నేలేదు. వానాకాలం వచ్చేసరికి ఆముదాన్ని, పత్తిని, సుబాబులను ఫల్టర్ సాయంతో భూమిలోకి దున్నెయ్యాలి. ఈ క్రమంలోనే భూమి పెంటగడ్డ అవుతుంది.

పై నాలుగు పనులు చేస్తే యిక ఎడారి భూతాన్ని ఏడు నిలువుల లోతున పాతిపెట్టినట్టే. యావత్తూ పొలం భూమి ఎల్లకాలం తడిగా వుంటుంది. తీక్షణమైన ఎండాకాలంలో గూడ భూమిని ఓ గజం తొవ్వితే - ఆ గజం కింది మట్టిని ముద్దగా చేయగలిగితే ఇక ఎప్పుడు ఏ కొంచెం వానవచ్చినా అదంతా నీళ్ళవుతుంది. ఓ వైపు రూపాయికి రూపాయి పెద్దవానలను నీళ్ళుగా మార్చగలం. మరోవైపు భూమి ఎల్లప్పుడూ తేమగా వుంటుంది కాబట్టి నీళ్ళ డిమాండు పావలాకి పడిపోతుంది. సప్లయ్ రూపాయి - డిమాండ్ పావలా అయితే ఇక నీళ్లకు కొదువ వుంటుందా? ఓ ఏడాది వానలు పడకపోయినా నీటి కరువయితే వుండదుగదా!

**కరువునే కరువు చేయడానికి కదలిరండిక!**

**- మోహన్**

**జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.

# زننہ نہرو شیخ اور کشمیر میں آرٹیکل ۳۷۰

آرٹیکل ۳۷۰ کشمیر میں لاگو کیوں کیا گیا اسکی وجہ کی جانکاری ہونا ضروری ہے. یہ سب جانتے ہیں کہ ہندوستان کا بٹوارہ مجحب کو لیکر ہوا . کانگریس مجحب کی بنیاد پر ملک بنانے کے خیال کے خلاف تھی. لیکن زننہ پاکستان لینے میں کامیاب ہواے .

جممو اور کشمیر ریاست کے راجہ کو یہ حق تھا کہ وہ ہندوستان یا پاکستان سے جڑنے کا خود فیصلہ کرے . یہ فیصلہ مجحب کی بنیاد پے ہو ، ایسی کوئی شرط یا پابندی اسپے لاگو نہیں تھی .

بٹوارے سے پہلے شیخ زننہ سے ملے تھے اور انہونے پاکستان سے جڑنے کے لئے
خودمختاری کی شرط جننہ کے سامنے رکھی جو جننہ کو منظور نہ تھی. شیخ خالی ہاتھ لوٹ آیا. شیخ نے مہاراجہ کے خلاف مہم چلیی تھی اور اس ترہ سے وہ مسلمانوں کے جانے مانے نیتا تھے .

کبایلی ریڈ کے ہوتے ہوتے مہاراجہ نے ہندوستان سے جڑنے کا فیصلہ لیا ؛ ریڈ سے پہلے وہ بھی خودمختاری کی سوچ رہے تھے . اس ترہ جممو اور کشمیر ہندوستان کی ریاست بن گیی.

نہرو کو شیخ سے ایک کسم کا لگاؤ تھا کیونکر وہ مہاراجہ کے نظام کے خلاف مہم چلا رہے تھے. نہرو کو کشمیر میں اسلیے دلچسپی تھی کیونکر وہ جننہ کو بتانا چاہتے تھے کی مجحب کی بنیاد پر ملک بنانا سہی خیال نہیں ہے.
مسلمانوں کی اکثیریت صرف کشمیر میں تھی ، نہ کہ پورے جممو اور کشمیر میں. نہرو کو شیخ کی جننہ کے ساتھ ہوئی بات چیت کا علم تھا اور اسکے نتیجے کا بھی. جننہ کی سیاست کو گلت ثابت کرنے کے لیے شیخ سے بڑکر کوئی اور ہتھیار نہیں ہو سکتا تھا. نہرو نے شیخ کا استمال کیا کیونکر وہ شیخ کی کمزوریوں کو جانتے تھے

نہرو نے مہاراجہ کے کشمیر واپس لوٹنے پر پرتیبند لگا دیا. نہرو جانتے تھے کہ شیخ خودمختاری چاہتے ہیں، اسلئے انہونیں شیخ کے ساتھ ایک ایسا الحاک کیا جس کارن سے کشمیر {مسلم اکثریت } ہندوستان کا حصّہ بن کر رہ گیا؛ چونکہ جممو اور کشمیر ایک ریاست رہی تھی اسلیے جممو کو بھی کشمیر کی ساتھ جوڑے رکھا.

اس سمجوتے کو آرٹیکل ۳۷۰ کا نام دیا گیا. لیکن شیخ تو شیخ تھا، جو صرف بےایمانی کی سیاست جانتا تھا. آرٹیکل ۳۷۰ کے باوجود وہ ہندوستان سے گداری کی منصوبہ پلتا رہا. اس وجہ سے ۱۹۵۳ میں انھ گرفتار کیا گیا اور انکی جگہ پر بکشی غلام محمّد کو جمواور کشمیر کا وزیر-ا –ازم بنایا گیا. آرٹیکل ۳۷۰ ایک وقتی بَند و بَست ہے جو صرف ایک سیاسی کھل سے جنما. کسی کو بھی یہ خواب دیکھنے کی ضرورت نہیں کی بنا آرٹیکل ۳۷۰ کسمیر ہندوستان کا حصّہ نہ بن پاتا؛ یا پھر اسے نکلنےپے کشمیر ہندوستان کا حصّہ نہ رہ پیگا.

# లోకవిద్యజనాందోళన - ఆమ్ఆద్మీపార్టీతో నా ప్రస్తానం

గత 30 సం॥రాలుగా ప్రభుత్వ ట్రెజరీ శాఖలో పనిచేస్తూ నేను పుట్టిన కర్నూలు జిల్లా కొడుమూరు ప్రాంతంలో ప్రజలతో సంబంధాలు కల్గి వుంటున్నాను. గత 40 సం॥రాలుగా ఎటువంటి అభివృద్ధి లేక కొడుమూరు ప్రాంతం రాష్ట్రం అభివృద్ధిలో చివరిస్థానంలో వుంది. కర్నూలు నుండి కొడుమూరు వైపుగా రోడ్లు అధ్వానంగా వున్నాయి. ఈ రహదారిలో అనేకసార్లు ప్రమాదాలు జరిగి వందల సంఖ్యలో ప్రజలు మరణించారు. 10 వేల ఎకరాలు సాగుచేసే గాజుల దిన్నె ప్రాజెక్టు తప్ప సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఈ పరిస్థితులలో దామోదరం సంజీవయ్య సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పరచి, సంక్షేమ పథకాల అమలులో అవకతవకలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్యం చేయడానికి కృషి చేస్తున్నాను. ఈ కృషిలో లోకవిద్యజనాందోళన సంస్థ నాయకులు నారాయణరావుగారి సహకారంతో నా నియోజకవర్గంలో తిరగడం జరిగింది.

2014లో అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలలో అనేకమంది మిత్రుల ప్రోత్సాహంతో ఆమ్ఆద్మీపార్టీ నుండి కొడుమూరు నియోజకవర్గం (రిజర్వ్‌డ్) నుండి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేయడం, ఆమ్ఆద్మీ పార్టీ ప్రజల్లో పనిచేయడానికి రూపొందించిన 'స్వరాజ్' ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. గ్రామసభలకు అధికారాల్లేకుండా అవినీతికి పాల్పడిన సర్పంచ్‌లను తొలగించే అధికారం కూడా ప్రజలకు లేకపోవడం, అధికారాలన్నీ కలెక్టర్ల వద్ద వున్న పరిస్థితిని వివరిస్తూ 'స్వరాజ్' ఆశయాలను లోకవిద్య ప్రపంచం పత్రిక ద్వారా ప్రజలల్లోకి తీసుకువెళ్ళడంలో లోకవిద్యాజనాందోళన నా కృషిలో ఎంతో సహకరించింది. ఎన్నికలలో నాతోపాటు లోకవిద్యాజనాందోళన నాయకులు ప్రచార కార్యక్రమంలో పాల్గొని నాకు నైతిక మద్దతు అందించారు.

అత్యధికంగా డబ్బు, మద్యం పారించి ఎన్నికలను ఒక పార్సుగా తయారు చేసిన రాజకీయ పార్టీలను తట్టుకొని ప్రజల్లో ఆమ్ఆద్మీపార్టీ ఆశయాలను ప్రచారం చేసే అవకాశం ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళగలిగాను. అనేకమంది మిత్రులు, ప్రజలు నా కృషిలో సహకరించినందుకు కృతజ్ఞతలు. ముఖ్యంగా కొడుమూరు నియోజకవర్గంలో మండలం, గ్రామాల్లో పార్టీశాఖలు ఏర్పరచి ఆమ్ఆద్మీపార్టీ ఆశయాలకనుగుణంగా పనిచేస్తానని నాకృషిలో లోకవిద్యాజనాందోళన తమ మద్దతు కొనసాగించాలని కోరుతున్నాను.

- నాయకంటి సదానందం

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.
http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,
Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

**మీకు తెలుసా!**

- హైదరాబాద్‌కు 70 కి.మీ దూరంలో జహీరాబాద్ దగ్గర పస్తాపూర్‌లో మహిళలు ఒక ఎకరంలో 16 రకాల పంటలు రాగి, కొర్ర, జొన్న, సజ్జ, తైదలు, మొ॥వి పండిస్తున్నారని తెలుసా?
- 70 గ్రామాలలో మహిళలే విత్తన బ్యాంకులు నిర్వహిస్తున్నారని విత్తనాల పండగలలో ఇతరులకు విత్తనాలు ఇస్తారని తెలుసా!
- 85 రకాలు విత్తనాలు, తక్కువ వర్షపాతంలో కరువు పరిస్థితిని తట్టుకుని నిలబడే విత్తనాలను మహిళలే (పట్టణ శాస్త్రజ్ఞులుకాదు) కనుగొన్నారని తెలుసా!
- ఎరువులు, పురుగుమందులు లేకుండా, పశువుల పేడ, వర్మీ కంపోస్టు వంటి సాంప్రదాయ విధానాలతో మాత్రమే సాగుచేస్తారని తెలుసా!
- గత 10 సం॥రాలుగా ఏ గ్రామంలోను రైతులు అప్పులు పాలవలేదని, ఆత్మహత్యలు చేసుకోలేదని, కుటుంబాలు అనారోగ్యం బారిన పడలేదని తెలుసా!

- తటవర్తి నారాయణరావు

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.

ఈ పత్రికలోని వ్యాసాలు యధాతథంగా పునఃప్రచురణ హక్కులు అందరివి.

BOOK - POST PRINTED MATTER
1 JULY - 2014

To

____________________

____________________

____________________

____________________

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.